# మధుర భావన-6

''నువ్వెపుడు వచ్చావమ్మా...'' అంటూ ఆశ్చర్యపోయాడు వంశీ.

''ఇపుడేలే... నువ్వు ఫోన్ ఆఫ్ చేసాకనే'' అందావిడ.

''అవునూ... సుమజ చేసిందని ఎందుకనుకున్నావ్...?'' ఆరా తీసాడువంశీ.

''నీ మొహంలో ఆనందాన్ని చూసి అనుకున్నా, నిజమేగా... చేసింది సుమజేనా...?'' ఆవిడ ప్రశ్నకి వంశీ నిష్ఠూరంగా చూసి అన్నాడు. ''అవునుగానీ, అదేమిటమ్మా... ఎవరో అమ్మాయి నా ఫోను నెంబరు అడిగి తీసుకుందని మాత్రమే చెప్పావుగానీ, మిగతా వివరాలేవీ చెప్పలేదేం...? వచ్చిన అమ్మాయి పేరు మీనా అనీ, సుమజ అడగమందనీ ఆ వివరాలన్నీ నువ్వు రాబట్టే వుంటావుగా...?''

''అవును... ఆ అమ్మాయి మీనా అన్నీ చెప్పింది. నువ్వు వాళ్ళింటికి వెళ్ళి సుమజ వాళ్ళింటి అడ్రసు తెలుసుకున్నావనీ... అపుడు సుమజని అడిగి నీకు ఇచ్చాననీ అన్నీ చెప్పింది.''

''అన్నీ... అంటే...?'' ఆత్రుతగా అడిగాడు వంశీ.

శ్యామసుందరి చిన్నగా నవ్వింది. అక్కడే వున్న ఓ కుర్చీని లాక్కుని కూర్చుని నిదానంగా చెప్పింది. ''అసలు నువ్వు... ఆ కవరు గురించి హడావుడి పడుతున్నపుడే నాకు కొంచెం అనుమానం కలిగింది... ఇటువంటిదేదో ఉందని! కాకపోతే... ఏదైనా నీ మనసులో మాట ముందుగా నాకే చెబుతావు కదానే నమ్మకంతో.... నాది అనుమానం అయి వుండవచ్చని అనుకుని వూరుకున్నా...''

''ఆ మాట నిజమమ్మా... నీకు చెప్పకుండా ఏ మాటా నా మనసులో ఉంచుకోలేను! కాకపోతే... ఈ విషయంలో అలా ఎందుకు చేసానంటే... ఇష్టమనేది నా వేపునుండే ఉంటే ప్రయోజనం ఏమీ ఉండదుగా... తన మనసులోని ఉద్దేశ్యమూ వెల్లడయ్యాకనే నీకూ చెప్పాలనుకున్నా... అంతే...! అవునుగానీ... మరి నువ్వూ అలా చేసావేం... మీనా చెప్పినవేవీ నాకు చెప్పనేలేదుగా...?'' వంశీ కంఠంలో నిష్ఠూరం ధ్వనించింది.

''నువ్వు చెప్పాకనే... నేనూ అడుగుదామనుకున్నా! నిజమే, మీనాను మరిమరి అడిగితే... వివరాలు చెప్పింది. నువ్వు వాళ్ళింటికి వెళ్ళినపుడు తన ఫ్రెండు సుమజని ఫోను చేసి అడిగిందట...! 'ఆ అబ్బాయికి నువ్వంటే బాగా ఇష్టం ఏర్పడిందనిపిస్తోంది. నీకూ ఇష్టమేగా నీ అడ్రసు

ఇద్దామనుకుంటున్నాను...!' అని. దానికి సుమజ, 'అబ్బాయి ఎలా ఉన్నాడూ... నీకూ నచ్చాడా' అని అడిగితే మీనా ఏమని జవాబు చెప్పానని చెప్పిందో తెలుసా...?'' అంటూ ఆవిడ గుర్తు చేసుకోవటానికి అన్నట్లుగా ఒక క్షణం ఆగి అపుడు మళ్ళీ కొనసాగించింది.

''పద్మ నయనంబులవాడూ ...నవ్వు రాజిల్లెడు మోము వాడు... లా అనిపించాడు అంటూ ఓ పద్య పాదాన్ని గుర్తుచేసి.... 'నీకు సరియైన జోడుగా భావిస్తున్నా ననే మాట తెలిపిందట. బహుశా కృష్ణుడి పేరుని బట్టీ నీ గురించి అలా అనిపించి ఉండొచ్చనీ కూడా అందట. వెంటనే సుమజ 'అయితే, నువ్వంత మంచి మార్కులేసాక నేను మాత్రం ఎందుకు కాదనుకుంటానూ, చూద్దాం... ఏం జరుగుతుందో, అడ్రసు ఇవ్వు...' అని తన ఫ్రెండు కి చెప్పేసరికి నీకు ఇచ్చిందన్న మాట! ఆ తర్వాత నువ్వు వెళ్ళటం, ఆ అమ్మాయి నీ ఫోను నెంబరు తెలుసుకోమని చెప్పటంతో ఇలా మనిల్లు కనుక్కుని వచ్చానని చెప్పిందిలే! చూసావా.... నువ్వు ఆ దామోదరం గారింటి ఫంక్షన్ కు వెళ్ళనని అన్నావా, నచ్చచెప్పి పంపించబట్టేగా, నీ మనసుకు నచ్చిన అమ్మాయి ఇలా తారసపడింది...!''

అవునని అంగీకరిస్తున్నట్లుగా వంశీ ముసిముసి నవ్వులు చిందించాడు.

''నిజమేనమ్మా... నువ్వలా పంపించటం వలన మంచే జరిగిందనుకో... నేను వాళ్ళింటికి వెళ్ళినపుడు... తన అభిప్రాయం తెలుసుకోవాలనుకున్నా. అప్పుడు నీకు చెప్పొచ్చనీ అనుకున్నా. కానీ... దామోదరం గారి ఫంక్షన్ లో మా ఇద్దరికీ ఇచ్చిని ఉమ్మడి బహుమతి కోసం వచ్చానని అనుకుంటున్నట్లుగా తను చెప్పేసరికి... ఏ విషయమూ స్పష్టంగా తెలియనపుడు నీకు అపుడే చెప్పటం ఎందుకనిపించి మౌనంగా ఉండిపోయానన్నమాట! తనకీ నా ఇష్టం స్పష్టంగా తెలియక, వాళ్ళింట్లో వాళ్ళు చూస్తున్న సంబంధాలకి ఏ కారణం చెప్పాలోనని ఆలోచిస్తూ ఇపుడు ఫోను చేసింది! నాకూ ఇపుడు ఈ విషయంలో తన అభిప్రాయం తెలిసింది కాబట్టి ఆ విషయం నిశ్చయంగా నీకు చెబుదామనుకునే సమయంలోనే నువ్వు అడిగేసావు...!''

వంశీ మాటలకు ఆవిడ చిన్నగా నవ్వుతూ అంది ''ఎలాగైతేనేంలే, నీకోసం అమ్మాయిని వెతికే శ్రమ నాకు తప్పింది! మరి... అమ్మాయిని నాకు ఎపుడు చూపిస్తావు...?''

వంశీ చిన్నగా నవ్వాడు. ''ఇపుడే కదమ్మా తన ఇష్టం ఖచ్చితంగా తెలుసుకున్నదీ... ఆ విషయాలన్నీ తీరిగ్గా ఆలోచిద్దాంలే".

* * *

రెండు రోజుల తర్వాత...

'సుమ ఎందుకు ఫోను చేయలేదూ, తనే చేద్దామా' అని ఆలోచిస్తున్న వంశీ బయటకు పనిమీద వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చాక డోర్ బెల్ మోగించాడు.

ఆ సమయంలో అమ్మ ఒకటే ఉంటుంది కాబట్టి ఆవిడే తలుపు తీస్తుందనుకున్న వంశీ తలుపు తీసిన అమ్మాయిని చూసి ఉలిక్కిపడి ''ఇదేమిటీ విడ్డూరం...! మీరు... మా ఇంట్లో... ఎలా...?'' ఆశ్చర్యంగా అడిగాడు.

సుమజ సరదాగా నవ్వుతూ మెల్లగా చెప్పింది ''ఏముందీ... కాళ్ళకు ఓ పసరు రాసుకుని... మిమ్మల్ని తలుచుకున్నాను... ఇక్కడ ఇలా వాలిపోగలిగానూ...!''

వంశీ హాయిగా నవ్వాడు.

లోపలకు వచ్చి స్థిమితంగా ఓ సోఫాలో కూర్చుని ''ఇపుడు నిజం చెప్పండి... పసరు మహత్యం లాంటివి నేనమ్మనుగానీ... ఎలా...?'' అంటూ సుమజవైపు ఆరాగా చూసాడు.

లోపల నుండి మాట్లాడుకుంటూ వచ్చిన తల్లినీ, సుమజ అమ్మగారినీ చూసి మొహం ఆశ్చర్యార్థంగా పెట్టాడు వంశీ.

శ్యామసుందరి చిరునవ్వుతో చెప్పింది. ''దామోదరంగారు మీ నాన్నకి ఎలా స్నేహితులో అలాగే సుమజ నాన్నగారు బలరామ్ గారికీ స్నేహితులు. వాళ్ళింట్లో జరిగిన శుభకార్యానికి వాళ్ళిద్దరికీ రావటానికి కుదరక వాళ్ళమ్మాయి సుమజని పంపించటం వలన మీ ఇద్దరికీ అక్కడ స్నేహం కుదిరింది.

సుమజ, వాళ్ళింట్లో నీ గురించి చెప్పాక, వివరాలకోసం దామోదరంగారికి వాళ్ళు ఫోను చేస్తే, ఆయన ఈ వూళ్ళోనే ఉంటున్న వాళ్ళ బంధువుల అడ్రసు, ఫోను నెంబరూ ఇచ్చారట. తీరాచూస్తే ఆవిడ వంశీ అమ్మగారు భార్గవికి స్నేహితురాలే అవటంతో ఆవిడ సూచనపై సుమజను తీసుకుని వాళ్ళింటికి వచ్చి నాకు ఫోను చేశారు. నేనేమో భోజనం చేస్తూ అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చని రమ్మంటే, వంటలోనూ సాయం చేయొచ్చని తొందరగా వచ్చేసారు! నువ్వలా బయటకు వెళ్ళగానే, వీళ్ళిలా వచ్చారన్నమాట!''

ఆనందాన్ని అదుపుచేసుకుంటూ వంశీ ''అవునా...'' అంటూ ఆశ్చర్యాన్ని మాత్రమే ప్రకటించాడు.

‘‘సరే, మీరిద్దరూ కాసేపు మాట్లాడుతూ కూర్చోండి... మేమిద్దరం అన్నీ భోజనాల బల్లపై సర్దేస్తాం. అందరం కలిసి భోజనాలు కానిద్దాం...!’’ అంటూ లోపలకు భార్గవిని వెంట బెట్టుకుని వెళ్తూ మళ్ళీ వెనక్కి తిరిగి చూసి చిరునవ్వుతో శ్యామసుందరి చెప్పింది. ‘‘నీ గదిలోకి తీసుకువెళ్ళి... అక్కడ కూర్చుని మాట్లాడుకోండి...!’’

వాళ్ళు అటు వెళ్ళగానే వంశీ సుమజని తన గదిలోకి తీసుకువెళ్ళి కూర్చోబెట్టి అడిగాడు ‘‘ముందుగానే ఫోను చేసి నాకు చెబితే, నేనీపూట అంతా ఇంట్లోనే ఉండేవాడినిగా... నీ గురించి ఆలోచిస్తూ... అలా ఒక్కడినీ బయట తిరిగిన సమయం అంతా వృథా అయినట్లేగా...’’ నిట్టూర్చాడు కూడా.

సుమజ చిన్నగా నవ్వింది. ‘‘సమయం వృథా కావటం అనొచ్చా... మనసులో మధుర భావనలు ఉప్పొంగటం కదా...!’’

ఆ మాటలకు వంశీ కళ్ళు పెద్దవి చేసి చూశాడు సుమజవైపు. సుమజ మళ్ళీ ముసి ముసి నవ్వులు రువ్వింది.

‘‘నాకూ... ఇపుడు... మీరన్న మాటల్లో నిజం ఉందని తెలిసి వచ్చింది! ఎంత మధురమీ హాయీ....’’ అటూ అల్లరిగా దీర్ఘం తీసింది.

వంశీ సరదాగా నవ్వాడు ‘‘అబ్బా.... నీకూ పాటలు తెలుసా...?’’

‘‘ఏం.... ఎందుకు తెలియవూ.... ఇది చేతిలో ఉంటే... ఏం తెలుసుకోవాలన్నా కష్టమేంలేదు. పాత పాటలు ఇపుడు నేనూ బాగా వింటున్నా...!’’ అంటూ సుమజ చేతిలోని సెల్ ఫోన్ ను చూపించింది.

వంశీ కూడా అంగీకరిస్తున్నట్లు చిరునవ్వుతో చూశాడు.

‘‘మా అమ్మకీ నువ్వు బాగా నచ్చినట్లున్నావు! తనని చూస్తేనే, నాకీ విషయం అర్థమైంది!’’ వంశీ మొహం లో ఆనందాన్ని చూపిస్తూ అన్నాడు.

‘‘అయివుండొచ్చు! కానీ... ఒక వేళ ఏ కారణంతోనైనా నేనంటే మీ అమ్మగారికి ఇష్టం ఏర్పడక... అభ్యంతరం చెబితేనో...’’

సుమజ అంటూ వుండగానే వంశీ చటుక్కున అన్నాడు'' అమ్మకి నా ఇష్టాలన్నీ బాగా తెలుస్తాయి! నావీ, తనవీ ఒకే రకం భావాలని నా ఉద్దేశ్యం! అందుకే నాకు కావాలనిపించింది ఏదైనా సరే. అమ్మ వద్దనటం నాకు తెలియదు ఇప్పటివరకూ కూడా!'' స్థిరంగా చెప్పిన అతనివైపు సుమజ ఒక క్షణం ఆశ్చర్యంగా చూసి ''ఒక వేళ... కాదని అంటే... మీ నిర్ణయం ఎలా ఉంటుందాని... కేవలం కుతూహలం...'' అంది.

వంశీ ఈ మాటకీ క్షణం కూడా ఆలోచించకుండా సమాధానం చెప్పేసాడు ''అలా జరగదని ఖచ్చితంగా అంటున్నాగా, ఇంక అలాంటపుడు ఇంకోలా జరిగితేననే ఆలోచన మాత్రం ఎందుకూ...?''

సుమజ నిట్టూర్చింది. ''బహుశా... స్వంత తల్లి కాకపోవటం వలన... మరీ గారాబంగా... రెట్టింపు బాధ్యత, ప్రేమతో పెంచారేమో...!''

వంశీ మొహం ఎర్రగా కందగడ్డలా మారింది. సుమజ వైపు కొంచెం కఠినంగా చూస్తూ'' ఏం... అంటున్నావూ...?'' అన్నాడు గట్టిగా.

సుమజ ఉలిక్కిపడి ఒక క్షణం అతనివైపు విస్మయంగా చూసింది. తర్వాత వెంటనే తేరుకుని నసుగుతూ ''ఇపుడే మీ అమ్మగారు... మా అమ్మకు చెప్పడం విన్నాను. మీ నాన్నగారికి... మీ అమ్మ గారు రెండో భార్య... అట కదా... అలా చెప్పటం వినీ అన్నానంతే...!'' సుమజ సంజాయిషీగా చెప్పింది.

వంశీ కూడా మామూలుగా అయ్యాడు... ''అందరం మర్చిపోయిన ఆ విషయం అమ్మ ఇప్పుడు ఎందుకు చెప్పినట్లో...!'' తనలో తను అనుకుంటున్నట్లుగా పైకే అన్నాడు. తర్వాత సుమజ వైపు చూస్తూ ''నీకో విషయం చెప్పనా... ఒకసారి మా ఇంటికి వచ్చిన బంధువులావిడ నాకీ విషయం చెప్పింది. బహుశా అప్పటికి నాకు పది సంవత్సరాల వయసుంటుంది. నేను ఆవిడ మాటలు విని షాకయ్యాను.. మరి నాకు ఊహ తెలిసినప్పటినుండీ 'అమ్మ' అనే పిలుస్తూ అలా ఆమె ఒడిలో గారాబంగా పెరిగాను! ఆవిడ, 'పిన్ని... నిన్ను బాగా చూస్తుందా' అంటూ ఏవేవో ప్రశ్నలు వేసింది. నేను 'పిన్ని ఎవరూ' అని అడిగితే, ఆవిడ ఫక్కున నవ్వి 'నీకు తెలియనే తెలియదా' అంటూ వివరం చెప్పింది.. నాకు పుట్టుకలోనే కన్నతల్లి చనిపోతే నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నారనీ, నేను అమ్మ అని అనుకుంటున్నావిడ నాకు పిన్ని అవుతుందనీ ఆవిడ అన్నది!

ఆ తర్వాత... అదే ఆలోచన మనసులో మెదులుతూంటే నేను అమ్మని 'తల్లిలేని పిల్లాడినని ఇంత ప్రేమగా చూస్తున్నావా?' అని అమాయకంగా అడిగా. దానికి అమ్మ ఏం చేసిందో తెలుసా... నా వైపు కోపంగా

చూసి నా తలపై ఒక దెబ్బవేసి 'నువ్వు తల్లి లేని పిల్లాడివా... మరి... నేను... ఎవర్రా?' అని గట్టిగా అరుస్తున్నట్లుగా అడిగింది.

నేను ఏడుపు మొహంతో చూసి ''అమ్మ వి...!'' అన్నాను.

అపుడు అమ్మ నా తల నిమిరి ప్రేమగా చెప్పింది. 'తల్లిలేని పిల్లాడు' అనే మాట ఇంకెపుడూ అనకు. ఆ మాట వింటేనే ... నాకు చిత్రవధగా ఉంటుంది అని చెప్పి... కళ్ళు తుడుచుకుంది. అప్పటి నుండీ నేనూ అదే అనుకున్నా. ఎవరు కన్నారనే ప్ర శ్న ఎందుకూ, అమ్మ అనే మాటకి విలువనూ, ప్రేమనీ ఇస్తూ ఎవరి చేతుల్లో పెరుగుతున్నానో... ఆమే నాకు అమ్మ...అంతే. ఎవరికైనా బాల్యం, అమ్మ... ఇవి మధుర భావనలే! నాకూ అంతే! ఆ తర్వాత.... ఇపుడు నీ పరిచయం... నీ ప్రేమ... మధుర భావనలన్న మాట...!'' అన్నాడు వంశీ మెరుస్తూన్న కళ్ళతో సుమజని చూసి.

సుమజ చిన్నగా నిట్టూర్చి అంది. ''ఇదంతా విన్నాక, నాకో సందేహం కలుగుతోంది... అడగనా... ఇపుడు... ఇద్దరం ఇలా ఇష్టంగా ఉన్నాం. పెళ్ళి అయ్యాకో... నేను... ఎందువలన అయినా వేరుగా వెళ్ళాలని... అంటే... ఏవో కారణాలు ఉండి.... మీతో అంటే.... మీ స్పందన ... ఎలా... ఉంటుందీ...?''

వంశీ చిరునవ్వుతో చూసాడు. ''నా సమాధానం ఏమై ఉంటుందని నువ్వు అనుకుంటున్నావు....?''

సుమజ చురుగ్గా చూసింది. ''నేనడిగిన ప్రశ్నకి జవాబు చుప్పాల్సింది మీరు... నన్నే ఎదురడగటం ఏమిటీ...?''

''నీ ఇష్టాన్ని... నేనెపుడూ కాదనను... గౌరవిస్తాను, 'సరే'... అనేదే నా జవాబు అవుతుంది...!'' అన్నాడు చిరునవ్వుతో చూస్తూ.

సుమజ చాలా ఉద్వేగంగా ''నిజమా...?'' అంది.

అవునన్నట్లు వంశీ తల వూపాడు. ''నీ ఇష్టాన్ని నేనెందుకు కాదనాలి సుమా... సరేనని సాదరంగా పంపిస్తాను!''

సుమజ బిత్తరపోయింది ''పంపించటం... ఏమిటీ? మీరూ రావాలిగా?'' అంటూ ఆశ్చర్యంగా చూసింది.

‘‘నేను చెప్పిందంతా విన్నాక... నీ కిలాంటి అనుమానం రాసేకూడదు! అందుకనే ‘వేరేగా వెళ్ళిలి’ అనటం వెనక నీ ఉద్దేశ్యం నువ్వొక్కదానివే నని అనుకున్నాలే... సరే... ఇపుడు నీకు మళ్ళీ చెబుతాను... నేను... అమ్మని ఒంటరిగా వదలననేదే నా జవాబు!

‘‘మరి...మరి... ఒకవేళ మీ అమ్మగారికే మీ చెల్లెలుతో కలిసి ఉండాలనే కోరిక కలిగితే...?’’

‘‘అపుడూ... అమ్మ ఇష్టాన్ని గౌరవించాల్సిందే! ఎవరికైనా వాళ్ళ ఇష్టప్రకారం జీవించే హక్కు ఉండాలి!’’

‘‘అవును... అది నిజం... అయినా ఇలాంటి విషయాల్లో మీ అభిప్రాయాలు తెలుసుకోవాలనే కుతూహలం కొద్దీ అడిగానంతే! మీ అమ్మగారితో కలిసి ఉండటం అదృష్టమే తప్ప వేరొకటి కాదు! ఎందుకనో గానీ, ఈ కొద్ది సమయంలోనే నాకటువంటి అభిప్రాయం, ఇష్టం ఏర్పడ్డాయి...!’’

వంశీ చిరునవ్వు నవ్వాడు. ‘‘అవును... నాదీ అదే నమ్మకం! ఎవరికైనా సరే, అమ్మను చూడగానే సదభిప్రాయం, స్నేహం చేసుకోవాలనే కోరికా కలుగుతాయి...!

వంశీ చెబుతుండగానే శ్యామ సుందరి వచ్చి ‘‘మీ ఇద్దరూ భోజనాలకు రండి. తర్వాత మళ్ళీ మాట్లాడుకోవచ్చులే...’’ అంది.

‘‘అమ్మా... నిన్నోమాట అడగాలి. ఒక క్షణం కూర్చో.’’

వంశీ అనగానే సుమజ లేచి బయటకు వెళ్ళిపోయింది.

‘‘ఏవిటో... త్వరగా చెప్పూ....’’ అంటూ ఆవిడ కూర్చుంది.

వంశీ సూటిగా చూస్తూ ‘‘వాళ్ళకి ఎందుకమ్మా...ఈ విషయం... అదే నువ్వు కన్నతల్లివి కాదనే సంగతి ఎందుకు చెప్పావని అడుగుతున్నా’’ అన్నాడు సీరియస్ గా.

‘‘పెళ్ళకి ముందో, తర్వాతనో... ఎవరో ఈ విషయం చెబితే, వాళ్ళు ‘అవునా... అంటూ ఏదో ఆశ్చర్యకరమైన విషయం వింటున్నట్లుగా అనిపించకూడదని... ముందుగా అన్ని విషయాలూ తెలియజేస్తూ... ఈ మాటా చెప్పానంతే...!’’

వంశీ నిట్టూర్చాడు ‘‘ఎందుకోగానీ అమ్మా... ఈ మాట వినటం గానీ, అలా అనుకోవటం గానీ నాకు ఇష్టంగా ఉండదు...!’’

శ్యామసుందరి చిరునవ్వుతో అతని తల నిమిరింది. ‘‘నాకూ అంతేగా! అయితే, నిజాన్ని చెప్పటానికీ, ఒప్పుకోవటానికీ సంకోచం ఎందుకూ... మనమేమిటో మన మనసులకు తెలిసినపుడు ఎవరూ మనమధ్య తేడాలు కల్పించలేరు...’’ అని ‘‘పద... వాళ్ళు మనకోసం ఎదురు చూస్తుంటారు. అందరం కలిసి ఒకేసారి భోజనాలు కానిచ్చేద్దాం...!’’ అంటూ తొందరపెట్టింది.

అలాగే అన్నట్లుగా తలవూపిన వంశీ... ఒక క్షణం ఏదో ఆలోచనలో మునిగినట్లు అలానే కూర్చుండిపోయి... తర్వాత లేచి వెళ్ళాడు.

* * *